
సాక్షి గుంటూరు

మంగళవారం । 8 । ఏప్రిల్ । 2025



వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం

అచ్చంపేట: స్థానిక సీతారామస్వామివారి దేవాలయం వద్ద సోమవారం శ్రీరామపట్టాభిషేక మహోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 516.30 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 2,053 క్యూసెక్కులు విడుదలవుతోంది.

సింహ వాహనంపై లక్ష్మీనరసింహస్వామి



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీరాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామి వారిని సోమవారం సింహ వాహనంపై పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

న్యూస్‌రీల్

బాలుడి కుటుంబానికి రూ. 5 లక్షల పరిహారం



బాలుడి కుటుంబ సభ్యులకు పరిహారం అందిస్తున్న దృశ్యం

సాక్షి, అమరావతి: గుంటూరు నగరంలో వీధి కుక్క దాడిలో మృతి చెందిన నాలుగేళ్ల బాలుడు ఐజక్ కుటుంబానికి ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు. సీఎం ఆదేశాలతో బాలుడి కుటుంబానికి సోమవారం పరిహారం అందించారు. బాలుడి కుటుంబానికి ముఖ్యమంత్రి సానుభూతి తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న వీధి కుక్కల సంతాన నియంత్రణ కోసం 4 నెలల్లో స్టెరిలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మొత్తం 3.43 లక్షల వీధి కుక్కలు ఉండగా, అందులో 2.03 లక్షల కుక్కలకు స్టెరిలైజేషన్ పూర్తయిందని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్ ముఖ్యమంత్రికి వివరించారు. వీధి కుక్కల సంఖ్య పెరగకుండా అదుపు చేసేందుకు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ల ఖాళీల భర్తీని తక్షణం చేపట్టాలని సీఎం సూచించారు. గుంటూరు తరహా ఘటనలు మళ్లీ తలెత్తకుండా మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత

నెహ్రూనగర్: వీధి కుక్క దాడిలో మృతి చెందిన బాలుడు ఐజాక్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెక్కును ఇన్‌చార్జ్ మేయర్ షేక్ సజీల అందజేశారు.. సోమవారం ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు స్వర్ణభారతినగర్ శివారు ఇద్యా నగర్‌లో కుక్క దాడిలో మృతి చెందిన బాలుని తల్లిదండ్రులు రాణి, నాగరాజులను పరామర్శించి రూ.5 లక్షల చెక్కుని అందించారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, కౌన్సిల్ టీడీపీ ఫ్లోర్‌లీడర్ కె.రవీంద్ర, స్థానిక కార్పొరేటర్ బి.స్మిత పద్మజ, ఎస్ఎస్ సోమశేఖర్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా సాయి కల్యాణ చక్రవర్తి



గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బి.సాయి కల్యాణ్‌చక్రవర్తి నియమితులయ్యారు. రాష్ట్రంలో వివిధ కోర్టుల్లో న్యాయమూర్తులుగా పనిచేస్తున్న కొందరికి పదోన్నతి, మరికొందరికి స్థానచలనం కల్పిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో విజయనగరం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న బి సాయి కళ్యాణ్ చక్రవర్తిని గుంటూరు జిల్లా ప్రధాని న్యాయమూర్తిగా నియమించారు. ప్రస్తుతం గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పని చేయుచున్న వై.వి.ఎస్.బి.జి.పార్థసారథిని హైకోర్టు రిజిస్ట్రర్ జనరల్‌గా నియమించారు.

గుంటూరు నగరంలో పర్యటించిన ఐజీ

పట్నంబజారు: గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి సోమవారం గుటూరు ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని పాతగుంటూరు పోలీసు స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఇటీవల కాలంలో ఆనందపేటలో జరిగిన వృద్ధురాలు పఠాన్ ఖాజాబీ హత్య, ఆమె కుటుంబ సభ్యులపై జరిగిన దాడి నేపథ్యంలో సంబంధిత కేసు వివరాలు అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. పూర్తి స్థాయిలో కేసుకు సంబంధించి దర్యాప్తు చేపట్టాలని, నిందితులను త్వరితగతిన అదుపులోకి తీసుకోవాలని స్టేషన్ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. అనంతరం ఆనందపేట 2వలైనులో హత్య జరిగిన ప్రాంతాన్ని కూడా ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పరిశీలించారు. ఐజీ వెంట ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సీతారామయ్య, పాతగుంటూరు పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వై.వీరసోమయ్య తదితరులు ఉన్నారు.

యార్డుకు 1,53,787 మిర్చి బస్తాలు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,53,787 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,37,288 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,300 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 64,276 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి చంద్రిక తెలిపారు.

ఇంటి ఇంటికో న్యాయం..

రాజధానిలో ఇదే నిజం

- గ్రామకంతం హద్దుల అంశంలో దారుణాలు
- ఒక్కో గ్రామంలో ఒక్కో విధంగా నిర్ణయాలు
- యజమానిని బట్టి భూమి మినహాయింపులు
- పేదోళ్లకు ఒకలా.. పెద్దోళ్లకు మరోలా అవకాశాలు
- అమరావతిలో అంతులేని అక్రమాలు
- మంత్రి నారాయణ హామీలకు మోసపోయామంటున్న బాధితులు
- న్యాయం జరగకపోతే కోర్టుకే అంటున్న యజమానులు



ఈ ఫొటోలో కనిపిస్తున్న భూమి తుళ్లూరు దామినేని కృష్ణవేణికి చెందినది. రోడ్డు నిర్మాణం కోసం 1.28 ఎకరాలు అవసరమైంది. ఇక్కడ రెండు బ్యారన్లు, రెండు షెడ్లు ఉన్నాయంటూ 1.28 ఎకరాలకు సమానమైన భూమిని ఇవ్వడంతో పాటు పరిహారంగా 6,193.83 చదరపు గజాల ప్లాట్‌ను ప్రత్యేకంగా కేటాయించారు. కృష్ణవేణి భర్త దామినేని శ్రీనివాసరావు తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌కు ప్రధాన అనుచరుడు, తుళ్లూరు మండల స్థాయి టీడీపీ నాయకుడు కావడమే ఇందుకు కారణం.

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: రాజధాని అమరావతి గ్రామాలలో ఇంటి ఇంటికో న్యాయం అన్నట్లు వ్యవహారాలు సాగుతున్నాయి. పాలకులు, ఉన్నతాధికారుల ఇష్టాయిష్టాలే నిర్ణయాలవుతున్నాయి. వాటినే న్యాయమైనవిగా చిత్రీకరించే యత్నాలు జరుగుతున్నాయి. గ్రామకంతాల హద్దుల నిర్ణయాలు, ప్రత్యామ్నాయంగా మినహాయించే భూమి విషయంలో తీవ్ర అన్యాయాలు చోటుచేసుకున్నాయనేది బహిరంగ రహస్యమే. దీనిపై ఏపీ సీఆర్‌డీఏ ఉన్నతాధికారుల వద్దకు వెళ్లిన ప్రతిసారీ పలు గ్రామాల వారికి అన్యాయం జరిగిన మాట వాస్తవమే అయితే తమ చేతుల్లో ఏమీ లేదని చేతులెత్తేస్తున్నారని యజమానులు వాపోతున్నారు. గ్రామకంతాల విషయంలో తమకు అన్యాయం జరిగిందని అప్పటి, ఇప్పటి పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ వద్ద ఎంతగా మొత్తుకుంటున్నా దాటవేత మాటలే తప్ప స్పష్టత రావడం లేదనే తీవ్ర ఆరోపణలు గ్రామస్తుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. అన్యాయాలను సరిచేస్తారనే నమ్మకం సడలుతున్నందున న్యాయస్థానాన్ని ఆశ్రయించడం మినహా గత్యంతరం లేదని రాజధాని గ్రామాల్లోని రైతులు హెచ్చరిస్తున్నారు.

భవిష్యత్తు అవసరాల కోసమంటూ...

అమరావతి రాజధాని కోసం భూ సమీకరణ పథకం (ల్యాండ్ పూలింగ్ స్కీం–ఎల్‌పీఎస్) కింద తాడేపల్లి, ఉండవల్లితోపాటు 29 గ్రామాల పరిధిలో భూములను తీసుకునే సమయంలో తెలుగుదేశం ప్రభుత్వం రైతులకు విభిన్న హామీలను కుమ్మరించింది. గ్రామాలను యథాతథంగా ఉంచుతామని, గ్రామకంతాలను స్పష్టంగా నిర్దేశిస్తామని, భవిష్యత్తు అవసరాలకు గ్రామ శివార్ల నుంచి కొంత భూమి యజమానులకు మినహాయింపుగా ఇస్తామని నమ్మబలికింది. రాజధాని ప్రకటన నోటిఫికేషన్ నాటికి ఉన్నది ఉన్నట్లేనని వెల్లడించింది. అయితే ఆ తరువాత పలుకుబడి కలిగిన వారికి ఓ న్యాయం, పేదలకు మరో న్యాయం అన్నట్లు వ్యవహారాలు జరిగాయి. ప్రభుత్వం నుంచి అనుచిత లబ్ధి పొందడానికి కొత్త నిర్మాణాలు పుట్టుకొచ్చాయి. ప్రభుత్వానికి అనుకూలురుగా ఉన్న వారి నూతన భవనాలు, షెడ్లను పరిగణలోకి తీసుకోగా, పేదలవి తిరస్కరణకు గురైన ఉదాహరణలు ఉన్నాయి. 2014–2019 మధ్య కాలంలో ఇలాంటివి చాలానే చోటుచేసుకున్నాయి.

ఒక్కో గ్రామంలో ఒక్కోలా...

గ్రామకంతం పరిధిలో నిర్మాణాలున్న యజమానులకు భవిష్యత్తు అవసరాల కోసం, ఖాళీ స్థలాల ఆధారంగా గ్రామ శివారును సరిహద్దుగా నిర్ణయించి, అక్కడి నుంచి 500 మీటర్లు పూర్తిగా వదిలేస్తామని మంత్రి నారాయణ ఊరూరా స్పష్టమైన హామీ ఇచ్చారు. ఇల్లు, పశువుల కొష్టం, గడ్డి వామి, బ్యారన్ తదితర నిర్మాణాల ప్రహరీలను గుర్తించి వాటిని హద్దుగా నిర్ణయిస్తామని ప్రభుత్వం చెప్పింది. అలాంటి యజమానులు స్థలాల కోసం దరఖాస్తు చేసుకుంటే పది సెంట్ల వరకు మినహాయింపుగా ఇస్తామని కూడా వివరించింది. ఇందుకు పంచాయతీరాజ్ చట్టాన్నీ ఉదహరించింది. కాగా కొన్ని గ్రామాల్లో పై హామీ విషయంలో అధికారులు ఉదారంగా వ్యవహరించగా మరికొన్ని చోట్ల అమలు చేయలేదు. దరఖాస్తుదారుల్లో పలువురికి పది సెంట్లు మాత్రమే మినహాయించగా, ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించిన వారికి, పలుకుబడి కలిగిన వారికి, అధికారులకు లంచాలు ముట్టచెప్పిన వారికి ఇష్టానుసారం భూమిని మినహాయించిన దాఖలాలు ఉన్నాయి. ఇంటి, ఇంటికీ, గ్రామ గ్రామానికీ మధ్య ఉన్న వ్యత్యాసాలను ఉటంకిస్తూ తమకూ తగిన న్యాయం చేయాలని 9.2 ద్వారా ఏపీ సీఆర్‌డీఏకి విభిన్న గ్రామాల వారు అర్జీలు అందజేస్తూ వచ్చారు. దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని ఇప్పటికీ అధికారికంగా ఏపీ సీఆర్‌డీఏ నిర్వహిస్తున్న సభలు, సమావేశాల్లో డిమాండ్ చేస్తున్నారు. గతంలో తమకు ఇచ్చిన హామీని మంత్రి నారాయణకు గుర్తు చేస్తున్నారు. తుళ్లూరు, విజయవాడల్లోని కార్యాలయాలకు వెళ్లి విన్నవిస్తున్నారు.



ఈ ఫొటోలోని ఇళ్లు నెక్కల్లులోని ముగ్గురు సోదరులవి. వీరి నివాసాలు శివారులో ఉన్నా గ్రామకంతం పరిధిలోకి చేర్చలేదు. భూమి మినహాయింపు ఇవ్వలేదు. తమకు జరిగిన అన్యాయంపై దరఖాస్తు చేసుకున్నా, ఎన్నిసార్లు అధికారులను కలిసినా ఇప్పటికీ ఫలితం లేదు.



నెక్కల్లు గ్రామ సర్వేనెంబరు 143/3లో మిక్సర్ కాలనీ(విభిన్న సామాజిక వర్గాల వారు కలిసి ఉంటారు.)లోని వారికి తీవ్ర అన్యాయం జరిగిందని గ్రామస్తులు చెబుతున్నారు. కాలనీలో చుట్టుపక్కల ఇళ్లు ఉన్నా పరిగణలోకి తీసుకోలేదు. న్యాయం చేయాలని కోరుతున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారు.



నెక్కల్లులో 1992లో వాటర్ ట్యాంకును గ్రామం మధ్యలో ప్రభుత్వం నిర్మించింది. దాన్ని కూడా గ్రామకంతం పరిధిలోకి చేర్చి మినహాయింపు ఇవ్వకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. నీటి పంపులు, నీటి తొట్లు, పొగాకు బ్యారన్లు, క్యూరింగ్ షెడ్లు, వ్యవసాయ పనిముట్లను నిల్వచేసుకునే స్థలాలను గ్రామకంతం పరిధిలోకి తీసుకుని భూమి మినహాయింపు ఇవ్వాల్సి ఉండగా అలా కూడా చేయలేదు. ఈ విధంగా తమ నెక్కల్లులోనే పాతిక కుటుంబాలకు పైగా భూమి మినహాయింపు దక్కక నష్టపోతున్నాయని గ్రామస్తులు 'సాక్షి'కి వివరించారు. పై తరహా పరిస్థితులే మందడం, ఐనవోలు, అనంతవరం, తుళ్లూరు తదితర గ్రామాల్లోనూ ఉండటం చర్చనీయాంశంగా మారాయి.

బీసీ వర్గానికి చెందిన ఓ వ్యక్తి స్థలం 2009లోనే చదరపు గజాలలో రిజిస్టరైంది. దీనికి మూడు వైపులా నిర్మాణాలు ఉన్నాయి. అయినా సరే గ్రామకంతం పరిధిలోకి చేర్చలేదు.

సర్వే నెంబరు 55లో ఓ మహిళకు చెందిన ఇంటి స్థలం 2008లోనే చదరపు గజాలలో రిజిస్టరైంది. అదే విధంగా 56, 57, 77, 121 సర్వే నెంబర్లలోనూ నిర్మాణాలను ఆనుకుని పశువుల కొష్టాలు, దొడ్లు ఉన్నాయి. 56 సర్వే నెంబరులో నలుగురు అన్నదమ్ములు ఒక్కొక్కరు తొమిదిన్నర సెంట్లు చొప్పున పంచుకుని గడ్డి వాములు ఏర్పాటు చేసుకున్నారు. వాటికి భూమి మినహాయింపు ఇవ్వకపోవడం పరిశీలనాంశం.

నెక్కల్లుకే చెందిన ఓ రైతు ఇంటి కాంపౌండ్ గ్రామకంతం కింద తీసుకుని భూమి మినహాయింపు ఇవ్వలేదు. దీనిపై అన్ని స్థాయిల్లోనూ వినతులు అందజేసినా స్పందన రావడం లేదు.

అర్జీల పరిష్కారంలో సమన్వయం ముఖ్యం

జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ



అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ

గుంటూరువెస్ట్: ప్రజల సమస్యలను మరింత వేగంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం తప్పనిసరిగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ వచ్చే ప్రతి అర్జీని నిర్ణీత కాలంలోనే పరిష్కరించాలన్నారు. పరిష్కారానికి వీలుకానివి, కోర్టు కేసుల్లో ఉన్నవి అర్జీదారునికి వివరించి చెప్పాలని పేర్కొన్నారు. బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా పరిష్కరించాలని తెలిపారు. తమ అర్జీలను ప్రజలు స్థానికంగా ఉండే మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయి అధికారులకు ప్రతి వారం ఇవ్వొచ్చన్నారు. దీంతో స్థానికంగా ఉండే ప్రజల సమస్యలు అక్కడే పరిష్కారమవుతాయన్నారు. ప్రజలు అందించే అర్జీలకు తప్పనిసరిగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. అనంతరం వచ్చిన 2235 అర్జీలను జేసీతోపాటు డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, జిల్లా అధికారులు పరిశీలించారు.

ప్రాణ సంకటం

- కుక్కల స్వైరవిహారం
- గుంటూరు ప్రజలు బెంబేలు
- గాలిలో పసిప్రాణాలు
- చోద్యం చూస్తున్న నగరపాలక సంస్థ అధికారులు



నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రజలపై విరుచుకుపడుతున్నాయి. చిన్నారులు, వృద్ధులు కుక్కకాట్లకు బలవుతున్నారు. అయినా నగర పాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యానికి తాజాగా ఆదివారం స్వర్ణ భారతినగర్‌లో ఇంటి ముందు ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలుడు ఐజక్ బలయ్యాడు. కుక్క మెడ కరుచుకుని తీసుకుపోవడంతో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడు. 2017 డిసెంబర్‌లోనూ ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారి కుక్క కరవడంతో చనిపోయాడు. కొద్ది నెలల క్రితం సంపత్‌నగర్‌లో ఓ బాలికపై కుక్క దాడి చేసింది. గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందింది. ఏడేళ్ల క్రితం హుస్సేన్‌నగర్ ఆంజనేయ కాలనీలో 9 మందిపై వీధి కుక్కలు దాడి చేశాయి. వీరిలో ఇద్దరు చిన్నారులు కూడా ఉన్నారు. గుంటూరులో రోజూ ఏదోచోట కుక్కకాటుకు ప్రజలు బలవుతున్నారు. జీజీహెచ్, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

జనవరి 9 నుంచి ఆగిపోయిన ఏబీసీ ఆపరేషన్లు

గుంటూరు నగరంలో వీధి కుక్కల నియంత్రణ కోసం నగరపాలక సంస్థ గతంలో చర్యలు చేపట్టింది. ఏటుకూరు రోడ్డులో స్నేహ యానిమల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కుక్కలకు కుటుంబ నియంత్రణ (ఏబీసీ) ఆపరేషన్లు చేయించేది. ఈ ఆపరేషన్లు చేసినందుకు ఒక్కో కుక్కకు రూ.రెండు వేల వరకూ స్నేహ సంస్థకు కార్పొరేషన్ చెల్లించేంది. అయితే నిబంధనలు పాటించకుండా ఆపరేషన్లు జరుగుతున్నాయని, స్టెరిలైజేషన్ సక్రమంగా ఉండటం లేదని, కుట్లు కూడా సరిగా వేయడం లేదని కొందరు జంతుప్రేమికులు యానిమాల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేశారు. దీంతో గత ఏడాది అక్టోబర్ 18న గుంటూరుకు విచ్చేసిన యానిమల్ బోర్డ్ సభ్యులు స్నేహ సొసైటీ చేస్తున్న ఆపరేషన్లలో లోపాలున్నాయని గుర్తించి ఆపరేషన్లు చేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. దీంతో జనవరి 9 నుంచి ఏబీసీ ఆపరేషన్లు ఆగిపోయాయి. ఆ తర్వాత మళ్లీ స్నేహ సంస్థ ఏబీసీ ఆపరేషన్లు చేసేందుకు అప్పీలు చేసుకోవడంతో జనవరి 24న యానిమల్ బోర్డ్ సభ్యులు గుంటూరు వచ్చి స్నేహ సంస్థ ఏబీసీ సెంటర్‌ను పరిశీలించారు. ఇంకా ఆపరేషన్ల నిర్వహణలో లోపాలు ఉన్నాయని సభ్యులు తేల్చారు. నగరపాలక సంస్థ తరపునే ఆపరేషన్ల చేయాలని ఆదేశించారు. దీనికి సంబంధించిన ప్రక్రియను నగరపాలక సంస్థ అధికారులు చేపట్టారు.

ఆపరేషన్లు చేయకుండానే బిల్లులు

గుంటూరు నగరంలో 31,400 కుక్కలు ఉన్నట్లు నగరపాలక సంస్థ లెక్కలు చెబుతున్నాయి. 4,500 కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు, యాంటీ ర్యాబీస్ వ్యాక్సిన్ వేసినందుకు రూ.37,48,500 లక్షలు ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. అయితే చాలా కుక్కలకు ఆపరేషన్లు చేయకుండానే చేసినట్లుగా బిల్లులు పెట్టుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కొద్ది నెలల క్రితం ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంహెచ్‌ఓగా పనిచేసిన ఓ అధికారి ఆధ్వర్యంలో గోల్‌మాల్ జరిగిందనే విమర్శలున్నాయి. రికార్డ్స్ పరిశీలించిన అధికారులకు లెక్కల్లో తేడాలు ఉన్నాయని పసిగట్టినట్లు సమాచారం.

కౌన్సిల్‌లో చర్చ

వీధి కుక్కల స్వైరవిహారం అంశం సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో చర్చకు వచ్చింది. వీధికుక్కల నియంత్రణలో అధికారుల వైఫల్యంపై వైఎస్సార్ సీపీ సభ్యులు నిలదీశారు. దీనికి స్పందించిన ప్రజారోగ్యధికారులు డిసెంబర్ 31 నాటికి నగరంలో ఉన్న వీధి కుక్కలకు వ్యాక్సినేషన్, ఏబీసీ ఆపరేషను పూర్తి చేస్తామని ప్రకటించారు.

'లెక్క'జిత్తుల బడ్జెట్

- అంతా అంకెల గారడీ
- వైఎస్సార్ సీపీ సభ్యుల నిరసన
- కౌన్సిల్లో బడ్జెట్ ఆమోదానికి నిరాకరణ
- ఎట్టకేలకు మెజార్టీ సభ్యుల మద్దతుతో బడ్జెట్‌కు ఆమోదం
- వీధి కుక్కల స్వైరవిహారంపై సుదీర్ఘ చర్చ





గుంటూరు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో టీడీపీ, వైఎస్సార్ సీపీ సభ్యుల వాగ్వాదం, అంతరచిత్రం సమావేశం నిర్వహిస్తున్న ఇన్‌చార్జి మేయర్ సజీల

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): బడ్జెట్ అంతా అంకెల గారడీ అని, నక్కజిత్తుల బడ్జెట్ అని వాస్తవ లెక్కలకు బడ్జెట్‌లో పొందుపరిచిన అంకెలకు పొంతన లేదని వైఎస్సార్ సీపీ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో సోమవారం ఉదయం బడ్జెట్ సమావేశం నిర్వహించారు. వాస్తవానికి ఈ సమావేశం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా, ఇన్‌చార్జి మేయర్ సజీల 11.57 గంటలకు వచ్చి సమావేశాన్ని ఆరంభించారు. సుదీర్ఘ చర్చ అనంతరం మెజార్టీ సభ్యుల మద్దతుతో రూ.1534.27కోట్ల బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

బాలుడి మృతికి సంతాపం

కౌన్సిల్ సమావేశంలో తొలుత గుంటూరు స్వర్ణ భారతి నగర్‌లో ఆదివారం వీధికుక్క దాడిలో నాలుగేళ్ల బాలుడు ఐజాక్ మృతిచెందడంపై సభ్యులు సంతాపం తెలిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ సభ్యులు మాట్లాడుతూ నగరంలో కుక్కల నియంత్రణకు ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. నగరంలో ఎన్ని కుక్కలు ఉన్నాయో లెక్కలు తేల్చాలని డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు(డైమండ్ బాబు) ప్రశ్నించారు. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని కార్పొరేటర్ మొహమూద్ పేర్కొన్నారు. గతంలో డెప్యూటీ మేయర్‌గా ఉన్న ప్రస్తుత ఇన్‌చార్జి మేయర్ షేక్ సజీల కూడా వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పోస్టర్ ప్రదర్శించారని కార్పొరేటర్లు సంకూరి శ్రీనివాసరావు, సాంబిరెడ్డి గుర్తుచేశారు. తక్షణం ప్రత్యేక సమావేశం నిర్వహించి వీధికుక్కల నియంత్రణకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని డెప్యూటీ మేయర్ డైమండ్‌బాబు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం డిమాండ్ చేశారు.

దురదృష్టకర ఘటన

వీధికుక్క దాడిలో బాలుడి మృతి దురదృష్టకరమని కమిషనర్ పులి శ్రీనివాసులు చెప్పారు. నగరంలో కుక్కలకు కుటుంబ నియంత్రణ(ఏబీసీ) ఆపరేషన్లు జరిగేవని, యానిమల్ వెల్ఫేర్ బోర్డు ఆదేశాలతో అవి నిలిచిపోయాయని వివరించారు. ప్రస్తుత సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లి నగర పాలక సంస్థ తరపున ఏబీసీ ఆపరేషన్లు చేసేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రస్తుతం గుంటూరు నగరంలో 31,400 కుక్కలు ఉన్నాయని, వీటలో 4,500 కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు చేశామని,, యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్లూ వేశామని వెల్లడించారు. కుక్కలను పట్టుకునేందుకు వెళ్తున్న మున్సిపల్ సిబ్బందిపై కొందరు దాడి చేశారని, వారిపై కేసు పెట్టామని పేర్కొన్నారు.

బడ్జెట్ తయారీలో లోపాలు

వార్షిక బడ్జెట్ తయారీలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని వైఎస్సార్‌సీపీ సభ్యులతో పాటు, కూటమి సభ్యులూ ఆరోపించారు.

బడ్జెట్ స్వరూపం ఇలా

	రూ.కోట్లలో
ప్రారంభ నిల్వ	670,23,59,195
జమలు	864,04,08,399
మొత్తం	1534,27,67,594
ఖర్చులు	1018,23,16,149
అంత్య నిల్వ	513,04,51,445

అసలు బడ్జెట్‌లో పొందుపరిచిన లెక్కలకు వాస్తవిక లెక్కలకు పొంతనే లేదన్నారు. టౌన్ ప్లానింగ్ ద్వారా వచ్చే ఆదాయం గత ఏడాది రూ.5 కోట్లు చూపితే ఈ యేడు రూ.10కోట్లు ఏ విధంగా వస్తాయని కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి ప్రశ్నించారు. టౌన్ ప్లానింగ్ నుంచి అసలు ఎంత ఆదాయం వస్తుందని కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాంప్రసాద్ అడిగిన ప్రశ్నకు అధికారుల నుంచి సరైన సమాధానం రాలేదు. దీంతో ఈ బడ్జెట్ తనకేం అర్థం కాలేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు.

వైఎస్సార్‌సీపీ సభ్యులకు అడ్డంకులు

బడ్జెట్ సమావేశంలో వైఎస్సార్ సీపీ సభ్యులకు అడుగడుగునా కూటమి సభ్యులు అడ్డంకులు సృష్టించారు. మాట్లాడే అవకాశం ఇవ్వకుండా గలాభా సృష్టించారు. ఖాళీ స్థల పన్నులు, మీడియా డిస్‌ప్లే డివైజ్ ఫీజులు, పారిశుద్ధ్యం, ట్రేడ్ లైసెన్స్‌లు, యూజర్ చార్జీలు, ట్యాక్స్‌లు, కేంద్ర ప్రభుత్వ పథకాల నిర్వహణలో లోపాలున్నాయని పలువురు సభ్యులు ప్రశ్నించారు. సాయంత్రం వరకు కొనసాగిన బడ్జెట్ సమావేశంలో చివరిగా డెప్యూటీ మేయర్ బాలవజ్రబాబు బడ్జెట్‌పై పశ్నలను అడిగే క్రమంలో కూటమి సభ్యులు లేచి నిలబడి తాము బడ్జెట్‌ను ఆమోదిస్తున్నామని, తీర్మానం చేయాలని అక్కడి నుంచి వెళ్లిపోయే యత్నం చేశారు. దీంతో ఇన్‌చార్జ్ మేయర్ సజీల వార్షిక బడ్జెట్ ఆమోదం పొందినట్లు ప్రకటించారు. దీనిని వైఎస్సార్ సీపీ సభ్యులు ఖండించారు.

చిన్నారికి వైఎస్సార్ సీపీ నేతల నివాళి



ఐజక్ మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న అంబటి రాంబాబు, నూరి ఫాతిమా, బలసాని కిరణ్‌కుమార్ తదితరులు

గుంటూరురూరల్: కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోయిన చిన్నారి మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా, నియోజకవర్గ ఇంచార్జ్ బలసాని కిరణ్‌కుమార్ తదితరులు సోమవారం సందర్శించి నివాళులర్పించారు. ఆ కుటుంబానికి సానుభూతి తెలిపారు. తల్లిదండ్రులతో మాట్లాడి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ నగరంలో ప్రజా ప్రతినిధులకుగానీ, కమిషనర్‌కు గానీ అడ్మినిస్ట్రేషన్‌పై నిబద్ధత లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారాన్ని గాలికి వదిలి కమిషనర్ సైతం టీడీపీ నాయకులతో కలిసి రాజకీయాలు చేస్తున్నాడని ఆరోపించారు. గతంలో జీజీహెచ్‌లో ఎలుకలు కరిచి చిన్నారి, నేడు కుక్కల దాడిలో మరో చిన్నారి మృత్యువాతకు గురయ్యాడన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన


సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్, ఆర్డీవో

పొన్నెకల్లు (తాడికొండ): తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలకు సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొననున్న నేపథ్యంలో ఏర్పాట్లను సోమవారం జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భార్గవ్ తేజ, ఆర్డీవో శ్రీనివాసరావు ఇతర అధికారులు పరిశీలించారు. పొన్నెకల్లు ఎస్సీ కాలనీ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం బైపాస్ రోడ్డులో బహిరంగ సభ ఏర్పాటు చేసేలా ఏర్పాట్లను పరిశీలించారు. తాడికొండలో అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఉన్న నేపథ్యంలో తాడికొండలో లేదా పొన్నెకల్లులో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసే దిశగా అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మెహర్‌బాబు, సీఐ కె వాసు పలువురు మండల స్థాయి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి ఐసెట్‌కు ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్ : పట్టాభిపురంలోని టీజేపీఎస్ పీజీ కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించనున్న ఐ–సెట్‌కు ఈనెల 9వ తేదీ నుంచి ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులచే ప్రతి రోజు ప్రాక్టీస్ టెస్టు, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, రీజనింగ్, ఎనలెటికల్, మాథమాటికల్, కమ్యూనికేషన్ ఎబిలిటీ, జనరల్ ఇంగ్లీష్ వంటి విషయాల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ యు. (97011 72533), కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఎం.శివకొండయ్య (96766 74858)ను సంప్రదించాలని సూచించారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

– ప్రాణాలతో బయటపడిన డ్రైవర్



మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెం చెరువులోకి కారు దూసుకెళ్లిన ఘటన సోమవారం జరిగింది. మంగళగిరి నుంచి కృష్ణాయపాలెం వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి చెరువులోకి దూసుకెళ్లింది. కారులో డ్రైవర్ ఒక్కరు మాత్రమే వుండగా వెంటనే కారు డోర్ తీసుకుని కారుపైకి ఎక్కి కాపాడాలని అరవడంతో అటుగా వెళ్తున్న స్థానికులు అతడిని రక్షించారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రభుత్వ ఆమోదానికి జెడ్పీ బడ్జెట్

- ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఆమోదించుకోలేని దుస్థితి
- వరుసగా రెండుసార్లు వాయిదా పడిన సర్వసభ్య సమావేశం
- ఏకపక్ష పనులు అనుమతులపై తీవ్ర అభ్యంతరం
- పార్టీ ఫిరాయించిన చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఏకతాటిపైకి వచ్చిన జెడ్పీటీసీలు
- బడ్జెట్ ఆమోదం తమ వల్ల కాదంటూ ప్రభుత్వానికి నివేదన
- గత ఏడాది మార్చి 31 నాటికే ఆమోదించుకోవాల్సిన బడ్జెట్
- పంచాయతీరాజ్ చట్టాన్ని అనుసరించి ప్రభుత్వానికి పంపిన సీఈవో


గుంటూరు జిల్లా పరిషత్ భవనం (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ 2025–26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ఆమోదం సాధ్యం కాలేదు. వరుసగా రెండుసార్లు వాయిదా పడిన సర్వసభ్య సమావేశంలో బడ్జెట్ ఆమోదం పొందలేకపోయిన దృష్ట్యా పంచాతీరాజ్ చట్టంలోని సెక్షన్ 199 సబ్ రూల్ 3 కింద బడ్జెట్‌ను ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపినట్లు జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు సోమవారం చెప్పారు.

పార్టీ ఫిరాయించిన చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా..

జెడ్పీ ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఆమోదించేందుకు చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా గత నెల 15న ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. వైఎస్సార్ సీపీ నుంచి జెడ్పీటీసీగా గెలిచిన హెనీ క్రిస్టినా గత సార్వత్రిక ఎన్నికలకు ముందు పార్టీ ఫిరాంచడంతో పాలకవర్గంలో సింహభాగమైన వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీలు ఆమె తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కీలకమైన బడ్జెట్ ఆమోదం కోసం రెండు వారాల వ్యవధిలో గత నెల 29న రెండోసారి సమావేశాన్ని ఏర్పాటు చేసినా, అదే రోజు టీడీపీ ఆవిర్భావ దినోత్సవమని, బడ్జెట్ ఆమోదానికి కావాల్సిన సంఖ్యలో టీడీపీ ప్రజా ప్రతినిధులు హాజరు కావడం లేదనే సమాచారంతో రెండు రోజుల ముందుగా సమావేశాన్ని వాయిదా వేశారు. చైర్‌పర్సన్ హోదాలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు జెడ్పీటీసీల అనుమతి లేకుండా, వారికి కనీస సమాచారమివ్వకుండా ఏకపక్షంగా పనులను మంజూరు చేస్తున్న విషయమై గతేడాది కాలంగా జెడ్పీటీసీలు ప్రతి సర్వసభ్య సమావేశంలోనూ గళం విప్పుతున్నారు. జెడ్పీ పాలకవర్గంలో భాగస్వాములైన జెడ్పీటీసీలను పక్కనపెట్టి అధికార పార్టీ ఎమ్మెల్యేల సిఫార్సులకు ప్రాధాన్యమిస్తూ, వారు చెప్పిన పనులకు జీ హుజూర్ అనడంపై జెడ్పీటీసీలు తీవ్ర అగ్రహంతో ఉన్నారు. ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో జెడ్పీటీసీలకు తెలియకుండా, సమావేశంలో ఆమోదింపచేయకుండా రూ.12 కోట్ల అభివృద్ధి పనులకు ఏకపక్షంగా అనుమతులు ఇవ్వడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, జెడ్పీటీసీలందరూ ఏకతాటిపైకి వచ్చి సమావేశానికి గైర్హాజరయ్యారు.

చైర్‌పర్సన్ తన అస్తిత్వాన్ని కోల్పోయినట్లే



జెడ్పీ బడ్జెట్ ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపడం చైర్‌పర్సన్ తన అస్తిత్వాన్ని కోల్పోయినట్లుగా భావించాలి. జెడ్పీ చరిత్రలోనే కోరం కాక వాయిదా పడటం తొలిసారి. గతనెల 29న జరగాల్సిన సమావేశాన్ని 50 శాతం సభ్యులు వాయిదా వేయాలని కోరినట్లుగా జెడ్పీటీసీలకు లేఖలు పంపారు. 50 శాతం మంది వాయిదా కోరి ఉంటే, మూడింట ఒక వంతు సభ్యులతో కోరం ఏర్పాటు చేసి, గత నెల 29నే సమావేశాన్ని ఎందుకు జరపలేకపోయారో ప్రజలకు చెప్పాలి. బడ్జెట్ ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపడం జెడ్పీ ప్రతిష్టను దిగజార్చడంతో పాటు పాలకమండలి సభ్యులను, జిల్లా ప్రజలను అవమానించడమే. పార్టీ ఫిరాయించిన చైర్‌పర్సన్ తక్షణమే రాజీనామా చేయాలి.

– పిల్లి ఓబుల్‌రెడ్డి, రొంపిచర్ల జెడ్పీటీసీ

బడ్జెట్ ఆమోదం తమ వల్ల కాదంటూ ప్రభుత్వానికి నివేదన

బడ్జెట్ సమావేశం వరుసగా రెండుసార్లు వాయిదా పడటంతో ఇక ఆమోదింపచేసుకోవడం తమ వల్ల కాదంటూ ప్రభుత్వానికి నివేదించడం జెడ్పీ పరిపాలన తీరు, తెన్నులకు అద్దం పడుతోంది. గత ఏడాది మార్చి 31 నాటికే ఆమోదించుకోవాల్సిన బడ్జెట్ చివరికి ప్రభుత్వ ఆమోదం కోసం వెళ్లింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.643 కోట్ల ఆదాయంతో రూపొందించిన అంచనా బడ్జెట్‌లో రూ.640 కోట్లు వ్యయం చూపారు. అదే విధంగా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాలను మినహాయిస్తే జెడ్పీ బడ్జెట్ రూ.71.11 కోట్ల ఆదాయం, రూ.69.10 కోట్ల మిగులుగా చూపారు.

గుంటూరు డీఆర్‌ఎంగా సుథేష్ణ సేన్ బాధ్యతల స్వీకరణ


సుథేష్ణను అభినందిస్తున్న రామకృష్ణ

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు డీఆర్‌ఎంగా ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీస్ (ఐఆర్‌ఏఎస్) సుథేష్ణ సేన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తాజామాజీ డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ సుథేష్ణకు బాధ్యతలు అప్పగించారు. రామకృష్ణ సౌత్ వెస్ట్రన్ రైల్వే జోన్‌కు ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్‌గా వెళ్లనున్న విషయం తెలిసిందే. సేన్ రైల్వేలో 1996 బ్యాచ్‌కు చెందిన వారు. ఆమె ఎకనామిక్స్‌లో ఆనర్స్ గ్రాడ్యుయేట్ డిగ్రీ, పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేశారు. తొలుత ఇండియన్ రైల్వే అకౌంట్స్ సర్వీస్‌కు ఎంపికై ముంబై సెంట్రల్ రైల్వేలో ఉద్యోగ బాధ్యతలు ప్రారంభించారు. అక్కడి నుంచి భోపాల్, జబల్పూర్, సౌత్ ఈస్టర్న్ రైల్వే కోల్‌కత్తాలోని వెస్ట్ సెంట్రల్ రైల్వేల్లో పని చేశారు. మంచి అధికారిగా గుర్తింపు పొందారు. ఆమె న్యూఢిల్లీలోని నార్తర్న్ రైల్వేలో ఆర్థిక సలహాదారు, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ (ఎఫ్ఏ అండ్ సీఏఓ)గా పని చేశారు. ఆమె డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, భారత ప్రభుత్వంలోని భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖలో కార్యదర్శిగా ఎన్‌సీఈఆర్‌టీగా డెప్యూటేషన్‌పై బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుంటూరు రైల్వే డివిజన్‌ను సిబ్బంది సమన్వయంతో మరింత అభివృద్ధి చేస్తానని చెప్పారు. అనంతరం డివిజన్‌లోని పలు విభాగాధిపతులతో ఆమె మాట్లాడారు.

తల్లీబిడ్డకు ఆరోగ్య సమస్యలు రాకుండా చూడాలి


మాట్లాడుతున్న సయ్యద్ జియావుద్దీన్

గుంటూరు లీగల్: ప్రతి బిడ్డా ఆరోగ్యంగా జన్మించాలని, ప్రసవ సమయంలో తల్లీబిడ్డకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు రాకుండా చూడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు సోమవారం గుంటూరు జీజీహెచ్‌లోని నర్సింగ్ విద్యార్థులకు, నర్సింగ్ సిబ్బంది, పిల్లల వైద్యశాఖ, ప్రసూతి వైద్య శాఖలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో జియావుద్దీన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా తల్లులు, నవజాత శిశువుల మరణాలు ఆందోళనకరంగా ఉన్నాయన్నారు. సదస్సులో డాక్టర్ అరుణ, డాక్టర్ దేవకుమార్, డాక్టర్ జయంతి, డాక్టర్ ఝాన్సీవాణి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ లెక్కలపై అధికారుల వద్ద సమాధానం లేదు

- సుదీర్ఘంగా చర్చ జరగాల్సి ఉంది
- కూటమి సర్కారులో అధికారులు అమ్ముడుపోయారు
- కౌన్సిల్ నుంచి కమిషనర్ బయటకు వెళ్లిపోవడమేమిటీ?
- నగర డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు ధ్వజం


మాట్లాడుతున్న డైమండ్ బాబు

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏర్పాటు చేసిన బడ్జెట్‌లో చాలా లోపాలున్నాయని వాటిపై ప్రశ్నిస్తే అధికారుల వద్ద నుంచి ఎటువంటి సమాధానం లేదని నగర డెప్యూటీ వనమా బాలవజ్రబాబు(డైమండ్‌బాబు) విమర్శించారు. సోమవారం నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్ ఆమోద సమావేశం జరిగిన తీరును వజ్రబాబు ఖండించారు. కౌన్సిల్ హాల్ వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. రూ.1534 కోట్లు బడ్జెట్ అంచనాల్లో చూపి, రూ.1018కోట్లు ఖర్చుపెడుతున్నట్లు చెప్పారని, ఈ నిధులు 57 డివిజన్లకు ఏ విధంగా ఖర్చు పెడతారని ప్రశ్నిస్తే సమాధానం లేదని విమర్శించారు. రూ.670కోట్ల ప్రారంభ నిల్వ చూపిన అధికారులు అది ఏయే ఖాతాల్లో ఉందని అడిగితే సమాధానం ఇవ్వలేదని ధ్వజమెత్తారు. ఈ సంవత్సరంలో నగరపాలక సంస్థ ఖర్చు పెట్టబోయే రూ.187కోట్లకు లెక్కల్లో సారూప్యత లేదని, దీనిపై లిఖిత పూర్వకంగా సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశామని వెల్లడించారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఫిక్స్‌డ్ డిపాజిట్స్ కింద రూ.150 నుంచి రూ.200కోట్ల వరకు ఉండాలని, ప్రస్తుతం రూ.45కోట్లు మాత్రమే ఉన్నాయని చెబుతున్నారని విమర్శించారు. సాధారాణ ఖర్చుల కింద ఈ సంవత్సరం రూ.169 కోట్లు ఖర్చు పెట్టినట్టు లెక్కల్లో చూపారని, వాటికి ఎలా ఖర్చుపెట్టారో చూపలేదని పేర్కొన్నారు. వీటన్నింటికీ ఎక్కడ సమాధానం చెప్పాల్సి వస్తుందోనని కమిషనర్ పులి శ్రీనివాసులు సీఎంఓలో పనుందని చెప్పి వెళ్లిపోయారని వజ్రబాబు విమర్శించారు. ఇన్‌ఛార్జ్ మేయర్ సజీల అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు.అధికారులు కూటమి ప్రభుత్వానికి అమ్ముడుపోయారని ఆయన వజ్రబాబు ఆరోపించారు.

రైస్ పుల్లింగ్ పేరుతో మోసం

- భార్యాభర్తల ఆవేదన
- పోలీస్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించిన ఎస్పీ సతీష్‌కుమార్


బాధితుల మొర ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): రైస్ పుల్లింగ్ పేరుతో కొందరు తమను మోసగించారని భార్యాభర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించారు. బాధితుల నుంచి ఎస్పీ సతీష్‌కుమార్ అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదిదారుల మొరను ఎస్పీ ఆలకించారు. బాధితులకు చట్ట ప్రకారం న్యాయం చేయాలని డీఎస్పీలు, సీఐలను ఆదేశించారు. జిల్లా ఏఎస్పీ కె.సుప్రజ (క్రైం), డీఎస్పీలు రమేష్ (ట్రాఫిక్), సుబ్బారావు (మహిళా పీఎస్) కూడా అర్జీలు స్వీకరించారు.

రుణం ఇప్పిస్తానని మోసం

గతేడాది కొత్తపేటకు చెందిన ఓ మహిళ పరిచయమైంది. డ్వాక్రా గ్రూప్ ద్వారా రూ.2 లక్షల రుణం ఇప్పిస్తానని నమ్మబలికింది. పొదుపు ద్వారా రూ.23 వేలు చెల్లించాలని చెప్పగా, రెండు విడతలుగా ఆమెకు చెల్లించా. మరో రూ.2 లక్షలు రుణం ఇప్పిస్తానని చెప్పగా అందుకు మేము నిరాకరించాం. దీతో రూ.2 లక్షల చెక్కు వచ్చిందని కొత్తపేటలో ఉంటున్న తన ఇంటికి తీసుకెళ్లింది. అల్పాహారం భుజించగా, కొద్దిసేపటికి మత్తులోకి జారుకున్నాను. దీంతో నా బంగారు ఉంగరం, చెవి పోగులు తస్కరించింది. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాను. ఇప్పటి వరకు పట్టించుకున్న పాపానపోలేదు. న్యాయం చేయగలరు.

– సీహెచ్.మంగాదేవీ, వెంకటరమణకాలనీ 2/4వ అడ్డరోడ్డు.

రూ.1.47 కోట్లకు టోకరా



తొమ్మిదేళ్ల క్రితం బుచ్చయ్యతోటలో ఉంటున్న ఓ ఫిజియోథెరపిస్ట్ పరిచయమయ్యాడు. రైస్ పుల్లింగ్ వ్యాపారం చేస్తున్నట్లు నమ్మించాడు. ముందుగా రూ.40 లక్షలు చెల్లిస్తే రూ.కోట్లల్లో డబ్బులొస్తాయమని నమ్మబలికాడు. ఇప్పటి వరకు సుమారు రూ.1.47 కోట్లను విడతలవారీగా చెల్లించాను. ప్రస్తుతం డబ్బులు అడిగితే సమాధానం చెప్పడం లేదు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. న్యాయం చేయగలరు.

– జి.ఆంజనేయులు, నానరమ్మ, భార్యాభర్తలు, చల్లవారిపాలెం, గుంటూరు రూరల్

పాన్‌మసాలా యాడ్స్ చేస్తున్న సెలబ్రిటీలపై చర్యలు తీసుకోండి



ప్రజారోగ్యానికి పెనుముప్పులా మారిన పాన్ మసాలా ఉత్పత్తులను ప్రోత్సహిస్తున్న ప్రముఖ సినీనటులపై కఠినమైన చర్యలు చేపట్టాలి. బాలీవుడ్ నటులు, ప్రముఖులు ఏకమై హానికరమైన పాన్‌మసాలా ఉత్పత్తులను ప్రచారం చేస్తున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహించిన సెలబ్రిటీలపైనా ఇటీవల తెలంగాణలో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఈ క్రమంలో ప్రజా ఆరోగ్యాన్ని నాశనం చేసే ప్రకటనలు యిచ్చే వారిపై కఠినమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.

– ఏపీ సిటిజన్ రైట్స్ ఫోరం అధ్యక్షుడు, న్యాయవాది షేక్.జిలానీ, న్యాయవాదులు నూనె పవన్‌తేజ, పాలపాటి అనీల్‌కుమార్, సత్య, సైదా, షారూక్.

దివ్యాంగుల చట్టంలో అనేక వెసులుబాటులున్నాయి

ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ్


ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకుంటున్న దివ్యాంగులు

గుంటూరు వెస్ట్: విభిన్న ప్రతిభావంతుల చట్టం–2016లో అనేక వెసులుబాటులున్నాయని వాటిని తెలుసుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో దివ్యాంగుల ఆస్తిపాస్తుల నిర్వహణ, ఫ్యామిలీ పెన్షన్‌తో పాటు తదితర అంశాలను పర్యవేక్షించేందుకు వీలుగా మందపాటి ఉదయ్ సాగర్, కొత్తపల్లి రవిబాబులను సంరక్షకులుగా నియమిస్తూ గార్డియన్‌షిప్ సర్టిఫికెట్‌ను అందజేశారు. జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ చట్టాన్ని అనుసరించి దివ్యాంగుల ఆస్తిపాస్తుల నిర్వహణ, ఫ్యామిలీ పెన్షన్‌తో పాటు తదితర అంశాలను పర్యవేక్షించేందుకు అవకాశముంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ సువార్త పాల్గొన్నారు.